
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 16 జూన్ 2024




| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 33 | 29 |
| భద్రాద్రి | 39 | 20 |

# పాలన కొత్తకొత్తగా..

- ఇరు జిల్లాల కలెక్టర్లు సహా పలువురు ముఖ్యుల బదిలీ
- త్వరలో మరికొంతమంది అధికారులకు స్థానచలనం
- ఎన్నికల కోడ్ ముగియడంతో పాలనపై దృష్టి సారించిన ప్రభుత్వం

ఖమ్మం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరుస ఎన్నికల కోడ్ ముగియడంతో రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ముందుగా ప్రభుత్వ శాఖల్లో తమ మార్క్‌ను



చూపేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బదిలీ పర్వానికి తెర తీసి ముందుగా ఐఏఎస్ అధికారుల బదిలీల ప్రక్రియ ప్రారంభించింది. తాజా బదిలీల్లో ఇరు జిల్లాలకు కొత్త ప్రభుత్వ సారథులు వచ్చారు. వీరితో పాటు పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం కలిగింది. వీరే కాంకుండా ఇతర శాఖల్లోని అధికారులు, ఉద్యోగుల బదిలీలు కూడా చకచకా జరగబోతున్నాయి. ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంకఅలాతో పాటు ఖమ్మం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఖమ్మం కార్పొరేషన్ కమిషన్ ఆదర్శసురభి, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌లకు ఒకేరోజు బదిలీ అయ్యాయి. వీరిలో ఖమ్మం, కొత్తగూడెం కలెక్టర్లు మినహా మిగిలిన వారంతా జిల్లా కలెక్టర్లుగా పదోన్నతులు పొంది వేరే జిల్లాలకు వెళ్లారు. ఖమ్మంకలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంకఅలాకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. వీరు రాష్ట్ర ప్రభుత్వంలోని కీలకశాఖల్లో కమిషనర్లుగా వెళ్లే అవకాశం ఉంది. కాగా ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్‌లతో పాటు పలు శాఖల జిల్లా అధికారులకు, మండల స్థాయి అధికారులకు సైతం బదిలీలు ప్రారంభం కాబోతున్నాయి. కొత్త కలెక్టర్లు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్లు, ఎంపీడీవోలకు బదిలీలు జరిగే అవకాశముంది. అలాగే పోలీసుశాఖలోనూ పలువురు సీఐలు, సబ్‌డివిజన్‌స్థాయి అధికారులు బదిలీ అయ్యే అవకాశం ఉంది. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు జిల్లా శాఖల అధికారులు కూడా బదిలీ జరగబోతుంది. ఇందుకోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. ఈనెలాఖరులోగా రెవెన్యూ, పోలీసు, వ్యవసాయం, ఇరిగేషన్, హెల్త్, ఎడ్యుకేషన్ వంటి కీలకశాఖల్లో క్షేత్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు బదిలీలు జరగబోతున్నాయి. అన్ని శాఖల్లో బదిలీల తర్వాతనే జిల్లా పాలనపై మంత్రులు దృష్టిసారించి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలును వేగవంతం చేయబోతున్నారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో ఎక్కడాలేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎంతో పాటు మరో ఇద్దరు మంత్రులున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు విధుల నిర్వహణ కత్తిమీద సాములా మారే అవకాశం ఉంది.



## భద్రాద్రి కలెక్టర్‌గా జితేష్ వి.పాటిల్

### 11 నెలలకే బదిలీ అయిన ప్రియాంక అలా


జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల శనివారం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కొత్త కలెక్టర్‌గా జితేష్ వి.పాటిల్‌ను ప్రభుత్వం నియమించింది. భద్రాద్రి నుంచి బదిలీ అయిన ప్రియాంకకు ప్రభుత్వం ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రియాంక అలా గతేడాది జూలై 15న భద్రాద్రి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 11 నెలలపాటు ఆమె కలెక్టర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచే గోదావరి వరదలు రావడంతో వరద సహాయ కార్యక్రమాల్లో బాధ్యతాయుతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. అనంతరం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు.


ప్రియాంక

శ్రీరామనవమి ఉత్సవాలు, ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు సైతం ప్రియాంక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్తగా కలెక్టర్‌గా నియమితులైన జితేష్ వి. పాటిల్ కామారెడ్డి కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై భద్రాద్రికి వస్తున్నారు. అంతకుముందు ఆయన కరీంనగర్ జేసీగా కొంతకాలం పని చేసి పదోన్నతిపై కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. మహారాష్ట్రకు చెందిన జితేష్ వి. పాటిల్ సాంగ్లీలోని వాల్‌చంద్‌కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి సివిల్‌ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. న్యూ ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ట్ నుంచి అర్బన్ ప్లానింగ్ మాస్టర్‌డిగ్రీ చేశారు. 2009 సివిల్ పరీక్షలో ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. అప్పటి నుంచి మహారాష్ట్రతోపాటుగా తెలంగాణలోని వివిధ శాఖల్లో పదవులు చేపట్టారు.

## ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌కు బదిలీ

### వికారాబాద్ కలెక్టర్‌గా నియామకం



భద్రాచలం, జూన్ 15: భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. 2023 జూలై 15న ఐటీడీఏ పీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రతీక్‌జైన్ 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఐటీడీఏ పీవోగా ఆయన 11 నెలలు పనిచేశారు. ప్రస్తుతం ఆయన బదిలీ కాగా ఆయన స్థానంలో భద్రాచలం ఐటీడీఏ పీవోగా ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు. ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వహించిన 11నెలల కాలంలో ప్రతీక్‌జైన్ ఏజెన్సీలో ప్రధానంగా విద్య, వైద్యంపైనే దృష్టి నిలిపారు. గిరిజన విద్యాసంస్థల్లో మూస పద్ధతులకు స్వస్తి పలికి నూతన ఒరవడులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన హయాంలోనే తొలిసారిగా గిరిజన విద్యా సంస్థల్లోని విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. నూతన విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ఆశ్రమ, గురుకుల విద్యా సంస్థల్లో మౌలిక సమస్యలు పరిష్కారం, సదుపాయాల ఏర్పాటుకు పీవోగా ప్రతీక్‌జైన్ ప్రత్యేక చొరవ చూపారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో పినపాక అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ప్రతీక్‌జైన్ వ్యవహరించారు. సౌమ్యుడిగా పేరున్న ప్రతీక్‌జైన్ ఐటీడీఏలోని వివిధ విభాగాల అధికారులతో తనదైన శైలిలో పనులు నిర్వహించేలా కృషి చేశారు.



## ఆర్టీసీ ఆర్‌ఎంగా సరిరాం

### ప్రస్తుత ఆర్‌ఎం వెంకన్న హైదరాబాద్‌కు బదిలీ

6

## ఖమ్మం కలెక్టర్‌గా
# ముజమ్మిల్ ఖాన్

- వీపీ గౌతమ్‌కు బదిలీ
- నాన్న పనిచేసిన చోటే కలెక్టర్‌గా రావడం ఆనందంగా ఉంది
- కొత్త కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మం, జూన్ 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఖమ్మం కలెక్టర్‌గా నియమించారు. నేడు ఆయన బాధ్యతలు స్వీకరించబోతున్నారు. హైదరాబాదుకు చెందిన ముజమ్మిల్ ఖాన్ రాష్ట్రంలో పదవీ విరమణ చేసిన హైదరాబాదు పోలీసుకమిషనర్, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ కుమారుడు. 2010లో బిట్స్ పిలానిలో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ముజమ్మిల్ ఖాన్ సివిల్స్‌లో 22వ ర్యాంకు పొందారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన శిక్షణ అనంతరం సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజా బదిలీల్లో ప్రభుత్వం ఆయన్ను ఖమ్మం కలెక్టర్‌గా నియమించింది. ఖమ్మం కలెక్టర్‌గా పనిచేయడం పెద్దసవాలే.. ఇక్కడ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఇద్దరు మంత్రులు తుమ్మల, పొంగులేటి ఉండగా వీరితో ఆయన సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. ప్రోటోకాల్ వ్యవహారంతోపాటు వారి సిఫార్సులు, సమీక్షల్లో వారిని నొప్పించకుండా పనిచేయడం ముజమ్మిల్ ఖాన్‌కు పెద్దసవాల్‌గా మారనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖమ్మం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న ముజమ్మిల్ ఖాన్ పాలనలో తన మార్క్ చూపించాల్సిన అవసరం ఉంది.


వీపీ గౌతమ్

### నేడు బాధ్యతల స్వీకరణ

ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. తాత స్ఫూర్తితో ఐఏఎస్ సాధించిన ముజమ్మిల్ ఖాన్ తండ్రి ఏకే ఖాన్ ఐపీఎస్ అధికారిగా, ఏసీబీ డీజీపీగా పలు పోలీసు విభాగాల్లో పనిచేసి రిటైర్ అయ్యారు. ఏకే ఖాన్‌కు ఖమ్మంతోనూ అనుబంధం ఉంది. 1981-82 ప్రాంతంలో కొంతకాలం ఆయన ఖమ్మంలో విధులు నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ముజమ్మిల్ ఖాన్ 8 నుంచి 10వ తరగతి వరకు నలంద విద్యాలయంలో చదివారు. బిట్స్ పిలానీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి గూగుల్ కంపెనీలో పనిచేస్తూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. మొదటి ప్రయత్నంలో ఐఆర్‌టీఎస్ సాధించి ఇండియన్ రైల్వేలో చేరారు. ఆ ఉద్యోగం చేస్తూనే 2017లో మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించారు. అకాడమీ శిక్షణలో పరిచయం అయిన కేరళకు చెందిన హమ్నా ఐఎఫ్‌ఎస్‌ను వివాహం చేసుకున్నారు. ముజమ్మిల్ ఖాన్‌కు పుస్తకాలు చదవడం, గిటార్ వాయించడం, రన్నింగ్ చేయడం అంటే బాగా ఇష్టం.

### ఖమ్మం కలెక్టర్‌గా రావడం ఆనందంగా ఉంది

**'ఆంధ్రజ్యోతి'తో ముజమ్మిల్ ఖాన్**

నాన్న ఏకే ఖాన్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన చోటే ఖమ్మం కలెక్టర్‌గా పోస్టింగ్ రావడం ఆనందంగా ఉంది. మా నాన్న 1981-82లో ఖమ్మంలో కొంతకాలం పనిచేశారు. ఇప్పుడు నాకు ఇక్కడ పోస్టింగ్ రావడం ఆనందంగా ఉంది. హైదరాబాద్, నల్లగొండ జిల్లాలతో నాకు ఎక్కువ అనుబంధం ఉంది. ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- ఆర్థిక ఇబ్బందులే కారణం : తండ్రి
- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఘటన


నరేంద్ర (ఫైల్)

ఇబ్రహీంపట్నం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో శుక్రవారం రాత్రి బీటెక్ ఫైనలియర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, ప్రేమ వ్యవహారమే అతడి ఆత్మహత్యకు గల కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామానికి చెందిన సంగెపు రాంబాబు కుమారుడు నరేంద్ర(22) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతూ ఆదిభట్ల ఏరోస్పేస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ఇబ్రహీంపట్నం టౌన్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్క గదిలో ఉన్న విద్యార్థులుచూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి రాంబాబు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనగా.. ఆత్మహత్యకు గల కారణం ప్రేమ వ్యవహారమేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నరేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వీవీపాలెం రహదారిపై రాస్తారోకో చేస్తున్న బాధిత రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



- అమరావతి-నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే అడ్డగింత
- రఘునాథపాలెం మండలంలో ఉద్రిక్తత
- సర్వేను అడ్డుకున్న రైతులను అరెస్టు చేసిన పోలీసులు
- బాధిత రైతులకు మద్దతుగా వీవీ.పాలెం రహదారిపై రాస్తారోకో
- కోర్టు స్టే ఉన్నా సర్వే నిర్వహించడంపై ఆగ్రహం

# సమాచారం ఇవ్వకుండా సర్వే ఏంటి?

రఘునాథపాలెం, జూన్ 15:ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో అమరావతి, నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకోసం చేపట్టిన భూసర్వేను బాధిత రైతులు అడ్డుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండానే సర్వే నిర్వహిస్తున్నారని సంబంధిత భూయజమానులు నిరసన తెలిపిసర్వేను అడ్డుకున్నారు. దీంతో సర్వే సిబ్బందికి రక్షణగా వచ్చిన పోలీసులు జోక్యం చేసుకోవటంతో రైతులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో తన భూమిలో సర్వే చేయవద్దని అడ్డుకున్న రైతును బలవంతంగా పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆ క్రమంలో తనకు కడుపులో గాయమైందని సదరురైతు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులు కథనం ప్రకారం.. అమరావతి, నాగపూర్ మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం శనివారం ఉదయం 5గంటలకే రఘునాథపాలెం మండలంలోని వీ.వెంకటాయపాలెం, చెర్వుకొమ్ముతండా, ఖమ్మంఅర్బన్ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ సిబ్బంది పోలీసు పహారా మధ్య సర్వే చేపట్టారు. అయితే ప్రస్తుతం పత్తి సాగు జరుగుతున్నందున రైతులు ఉదయాన్నే తమ పొలాలకు వెళ్లగా అక్కడ పదుల సంఖ్యలో పోలీసులతో సిబ్బంది సర్వే చేయటాన్ని రైతులు గమనించారు. వెంటనే భూ బాధిత రైతుల వాట్సాప్‌గ్రూప్‌లో సర్వే చిత్రాలను షేర్ చేయడంతో రైతులంతా ఉదయం 7గంటలకే తమ భూముల వద్దకు చేరుకొని సర్వే సిబ్బందిని అడ్డుకున్నారు. ఈక్రమంలో వీ వెంకటాయపాలెంలో రైతులు పోతగాని పుల్లయ్య, ఆవుల సత్యనారాయణ సర్వే సిబ్బందిని తీవ్రంగా అడ్డుకున్నారు. ఏ హక్కు ఉందని తమ భూమిలోకి వచ్చి అనుమతి లేకుండా సర్వే చేపట్టారని నిలదీశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆ ఇద్దరు రైతులను బలవంతంగా రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే పోలీసులు తమను స్టేషన్‌కు తరలించే క్రమంలో తనకు కడుపులో గాయమైందని రైతు పోతగాని పుల్లయ్య విలేకరులకు తెలిపారు. రైతులను పోలీసు స్టేషన్‌కు తరలించటం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆయా భూ యజమానులు తోటి రైతులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. భూ బాధిత రైతులు ఒక్కసారిగా వీవీపాలెం రహదారిపైకి వచ్చి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు సర్దిచెప్పటంతో వారు రాస్తారోకోను ముగించారు. తర్వాత రైతుల నిరసనల మధ్య పోలీసుల రక్షణతో సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి రఘునాథపాలెం సరిహద్దులోని బాలపేట వరకు గ్రీన్‌ఫీల్డ్ సర్వే పూర్తి చేశారు. ఇదిలా ఉండగా వీ వెంకటాయపాలెం, ఖమ్మం అర్బన్ సరిహద్దులోని సర్వే నెంబర్ 256, 267లో భూముల్లో సర్వేపై ఇప్పటికే కోర్టు స్టే విధించింది. అయినా గ్రీన్‌ఫీల్డ్ అధికారులు శనివారం ఆయా భూముల్లో సర్వే చేపట్టారు.



## ఖమ్మం మునిసిపల్ కమిషనర్ బదిలీ

- వనపర్తి జిల్లా కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి
- ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించని ప్రభుత్వం

ఖమ్మం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన సివిల్స్‌లో 393 ర్యాంకు సాధించారు. కాగా ఆయనను ఖమ్మం జిల్లాకు ట్రెయినీ కలెక్టర్‌గా నియమించారు. అనంతరం ములుగు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కొంతకాలం పనిచేసిన తర్వాత 2021 సెప్టెంబర్ 20న ఖమ్మం మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. రెండున్నరేళ్లకుపైగా ఆయన ఖమ్మం కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నూతన మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తొలి మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఘనత ఆయనకు ఉంది. ఆయనకాలంలోనే ఖమ్మం నగరానికి మురికి కూపంగా ఉన్న గోళ్లపాడు ఛానల్‌ను ఆధునీకరించి అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ డ్రైనేజీ వ్యవస్థపైనే ఆహ్లాదకరమైన పార్కులను ఏర్పాటు చేయడంలో సఫలీకృతులయ్యారు. లకారం ట్యాంక్‌బండ్ సుందరీకరణ, తీగల వంతెన, రహదారుల విస్తరణలో, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఆదర్శ్‌సురభి కృషి చేశారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా ఆయన కృషి చేశారు. కాగా ఆయన స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

# నాగ్‌పూర్-అమరావతి హైవే క్లియర్

- ఖమ్మం-విజయవాడ వరకు పాత అలైన్‌మెంటే ఖరారు
- రైతుల ఆందోళనల నడుమ సర్వే పూర్తి చేసిన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 15: నాగ్‌పూర్-అమరావతి హైవే నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సర్వే పూర్తయ్యింది. ఈ హైవేలో భాగంగా ఖమ్మం కొత్త కలెక్టరేట్ సమీపం నుంచి నిర్మించనున్న ఈ హైవే ఖమ్మంజిల్లా పరిధిలో 60కిలోమీటర్ల పొడవు ఉండనుంది. కేంద్రం దీనికోసం రూ.1,800కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇది పూర్తయితే కేవలం 70-80 నిమిషాల్లోనే ఖమ్మం నుంచి విజయవాడ చేరుకోవచ్చు. ఇప్పటికే రెండు విడతల్లో భూసేకరణ కూడా పూర్తయింది. మూడోవిడత ఖమ్మం శివారులో భూసేకరణకు ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో గతేడాది నుంచి హైవే నిర్మాణంలోనే ప్రతిష్టంభన నెలకొంది. పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీనికి జిల్లాకు చెందిన అప్పటి మంత్రి భూసేకరణకు అడ్డుపడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. తనకు చెందిన వ్యక్తుల భూముల్లోంచి వెళ్లే హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ అలైన్‌మెంట్ ఆగిపోయింది. అయితే దీనికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని ఆదేశాలు రావడంతో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు శనివారం సర్వే నిర్వహించారు. రఘునాథపాలెం, వీవీపాలెం, వేపకుంట్ల వందనం గ్రామాల పరిధిలో సుమారు 6.42 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్


సర్వే చేస్తున్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

కోసం సర్వే నిర్వహించారు.ఈ ప్రాంతంలో 70 ఎకరాల 10కుంటల భూమి అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సర్వేను నిర్వహించారు. ఉదయం 5 గంటలకే అధికారులు సర్వే నిర్వహించడంతో రఘునాథపాలెం మండలంలో స్థానిక రైతులు ఆందోళన చేశారు. నాగ్‌పూర్ నుంచి వరంగల్ మీదుగా ఖమ్మం (ఎన్ హెచ్ 163జీ )108 కిలోమీటర్లు, ఖమ్మం నుంచి విజయవాడ (ఎన్‌హెచ్ 163జీ) వరకూ 90కిలోమీటర్లు రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందులో కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి.

అయితే, ఖమ్మం-విజయవాడ హైవేకు గతంలోనే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ వివిధ కారణాలతో అప్పట్లో అది రద్దయ్యింది. అయితే తాజాగా భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా కేంద్రం మళ్లీ అంగీకారం తెలిపింది. ఈ హైవే ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల మీదుగా ఏపీకి అనుసంధానం కానుంది. దాంతో, హైవేకు, కలెక్టరేటుకు అనుసంధాన రోడ్డును నిర్మించాలని కూడా నేషనల్ హైవే అథారిటీ నిర్ణయించింది. ఇప్పుడు ఈ జాతీయ రహదారి రాజకీయ చక్రబంధంలో చిక్కుకుంది. ఈ హైవే కారణంగా ఖమ్మం శివారులో మాజీ నేతలకు చెందిన అనుయాయుల భూములు భూసేకరణలో పోనున్నాయి. హైవే నిర్మాణానికి మొత్తం మూడు గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే రెండు నోటిఫికేషన్లు విడుదల చేశారు. ఆ మేరకు భూసేకరణ కూడా పూర్తయినట్లు సమాచారం. మూడో గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఖమ్మం శివారులో భూమిని సేకరించాల్సి ఉంది. కీలక నేత మోకాలడ్డడంతో ఇక్కడ నోటిఫికేషన్, భూసేకరణ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైవే పనుల్లో ప్రతిష్ఠంభన ఏర్పడింది. అయితే శనివారం సర్వే పూర్తి కావడంతో ఇక పనులు యథావిధిగా కొనసాగనున్నట్లు తెలిసింది. .



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, జూన్ 15: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికి స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, ఆశీర్వచనం నిర్వహించారు. సీతారామచంద్ర స్వామిని త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి శనివారం దర్శించుకున్నారు.

# 'బీటెక్' కల నెరవేరేనా?

- మధిరలో అప్‌గ్రేడేషన్‌కు సిద్ధంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ప్రతిపాదనలు
- ఫలిస్తే ఈ విద్యా సంవత్సరమే తరగతులు



మధిర, జూన్ 15: మధిర ప్రాంత విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. కమీషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చొరవ తీసుకొని అవసరమైన స్థలం కోసం రెవెన్యూ అధికారులను లెటర్ ద్వారా అడిగారు. అందుకు తహసీల్దార్ సర్వే చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్, విధుల కారణంగా స్థలం పరిశీలన జాప్యం జరిగింది.

**పాలిటెక్నిక్ కళాశాల అప్‌గ్రేడ్ కోస్గీతో మొదలు..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో మహబూబ్‌నగర్ జిల్లా కోస్గీ కాలేజీని అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు వచ్చాయి. దీంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అందుకు అనుకూలంగా ఉందని మధిర కాలేజీని కూడా అప్‌గ్రేడ్ చేసే విషయం పరిశీలించాలని కోరడంతో సీటీఈ అధికారుల్లో కదలిక వచ్చింది. మధిరలో పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ప్రభుత్వ స్థలం ఉందా అని తహసీల్దార్‌కు లేఖ రాశారు. 15 ఎకరాల స్థలం కళాశాల ఏర్పాటుకు అవసరవుతుంది. దీనిపై తహసీల్దార్ సర్వేచేయాల్సి ఉంది. సమీపంలో ప్రభుత్వ స్థలం రూరల్ పోలీస్‌స్టేషన్ వెనుకాల ఉన్నట్లు సమాచారం. లేకుంటే ప్రైవేట్ వ్యక్తుల స్థలం కొనుగోలుచేసేందుకు సిద్ధమని తహసీల్దార్ తెలిపారు. అందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. అయితే కోస్గీలో కూడా ఇలాంటి పరిస్థితే ఉన్నా ముఖ్యమంత్రి పట్టుదలగా ఈ సంవత్సరమే కాలేజీ ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

**ఇంజనీరింగ్ తరగతులకు అనుకూలం**

భట్టి విక్రమార్క పట్టుపడితే ఈసంవత్సరమే తరగతులు ప్రారంభించేందుకు మధిర కళాశాల అన్ని విధాలుగా అనుకూలంగా ఉంది. మధిర కాలేజీ తిరువూరు రోడ్‌లో ఖాజీపురంలో ఉంది. కళాశాల 5ఎకరాల ఏడు కుంటల విశాలమైన స్థలంలో ఉంది. 24 గదులు, హాల్సుతోపాటు వేరుగా హాస్టల్ భవనం ఉంది. విశాలమైన హాల్సు, గదులు ఉండటంతో ప్రతిసారి ఎన్నికల విధులు, కౌంటింగ్‌కు ఈ కళాశాలనే ఎంచుకుంటున్నారు. కళాశాలలో 40 మంది వరకు నిపుణులైన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు. 2008లో మధిరలో ప్రారంభమైన పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానిక్ కోర్సులు మాత్రమే నడుస్తున్నాయి. ఇప్పటికే 15బ్యాచ్‌లు విద్యార్థులు కోర్సుపూర్తి చేశారు. కళాశాల అన్ని విధాలుగా తరగతులు ప్రారంభానికి అనుకూలంగా ఉన్న దృష్ట్యా ప్రభుత్వం చొరవ తీసుకొని ఇంజనీరింగ్ తరగతులు ఈసంవత్సరమే ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షపండులాఉంది. పూర్తిగా బడుగు, బలహీన వర్గాల పిల్లలే ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు పెట్టి ఇంజనీరింగ్ చదవలేక అనేక మంది డిగ్రీలతోకే ఆగిపోతున్నారు. మధిరలో ఇంజనీరింగ్ విద్య అందుబాటులోకి తీసుకొస్తే ఎంతోమందికి ప్రయోజనకరంగా ఉంటుంది.

### మణుగూరు టు విజయవాడ.. 'తెలుగు' తమ్ముడి పాదయాత్ర



నాగేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న అశ్వాపురం టీడీపీ నాయకులు

మణుగూరుటౌన్/ అశ్వాపురం, జూన్ 15: ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో శ్రీ కనకదుర్గమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు శనివారం టీఎన్‌టీయూసీ నాయకుడు మేదరమెట్ల నాగేశ్వరరావు పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రను అశ్వాపురం మండల టీడీపీ నాయకుడు తుళ్లూరి ప్రకాష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ క్రమంలో అశ్వాపురంలో నాగేశ్వరరావుకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అశ్వాపురం మండల పార్టీ అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాశరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాస్, పసునూరి సీత, కృష్ణ, చెరుకురి నగేశ్వరరావు, చందా మధు, ధర్మరాజు శంకర్, మడి శాంతమ్మ, వీర రాజు, వీరయ్య, సరిత వాసు, నగేష్, భాస్కర్‌రావు, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పామాయిల్ రైతు సంఘ నాయకులు

## పామాయిల్‌కు ధర హామీ చట్టం చేయాలి

- ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి
- ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి డిమాండ్

అశ్వారావుపేట, జూన్ 15: పాలకులు మారుతున్న పామాయిల్ రైతుల వెతలు మారడం లేదని, పామాయిల్ అభివృద్ధికోసం పామాయిల్ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో తెలంగాణ పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర సదస్సు రాష్ట్ర కన్వీనర్ కొక్కెరపాటి పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రంగారెడ్డి మాట్లాడుతూ దేశసంపదకు మూలం రైతులు, శ్రామికులేనని ఫెడరేషన్ పేరుతో పామాయిల్ సొమ్మును కొందరు గద్దల్లా తన్నుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. వ్యవసాయం కోసం బడ్జెట్ కేటాయించడం తప్ప కేంద్రం దానికి తగ్గట్టు నిధులు ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా రైతులకు వ్యతిరేకంగా ఈ ప్రభుత్వాలు వ్యవహరించడం బాధాకరమని అన్నారు. ముప్పై లక్షల టన్నుల పామాయిల్‌ను భారతదేశం రూ.80వేల కోట్లు వెచ్చించి ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకుంటుందని, అదే మనదేశంలో పండిస్తే విదేశీమారక ద్రవ్యం వచ్చే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సదర్శన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులు పండించే పంటకు భరోసా కల్పించినపుడే రైతు ధైర్యంగా ముందుకు వెళ్లి సాగుచేస్తారన్నారు. పామాయిల్ పంటలకు భరోసా కలిగించాలని డిమాండ్ చేశారు. పామాయిల్‌కు టన్ను రూ.25వేలు హామీ ధరను ప్రకటించాలని కోరారు. పామాయిల్‌ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరు మహేశ్వరరెడ్డి సాగుదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయిల్‌పామ్ చట్టంతో రూపొందించిన సమాచార పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎలమంచిలి వంశీకృష్ణ, అన్నవరం సత్యనారాయణ, అశ్వారావుపేట గ్రోయర్స్ సొసైటీ బాధ్యుడు ఆళ్ల నాగేశ్వరరావు, భువనేశ్వరి రెడ్డి పాల్గొన్నారు.

# గౌతమ్ @ రెండేళ్ల 11 నెలలు

- ఖమ్మం నుంచి బదిలీ అయిన కలెక్టర్
- పాలనలో మార్కు చూపించిన ఐఏఎస్
- అందరితోను సమన్వయం.. ముక్కు సూటితనం
- ధరణితో పాటు పలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**జిల్లాలో తన పనితీరుతో గుర్తింపు పొందిన కలెక్టర్లలో ఒకరిగా వీపీ గౌతమ్ నిలిచారు. 2021 జూలై20న మహబూబాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు భద్రాచలం ఐటీడీఏ అధికారిగా ఉమ్మడి జిల్లాలో సేవలందించారు. గిరిజన ప్రాంతం, గిరిజన సమస్యలపై కూడా పట్టుసాధించిన వీపీ గౌతమ్ అదే ఒరవడితో ఖమ్మం కలెక్టర్‌గా రాణించారు.**



ఖమ్మం, జూన్15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో తన పనితీరుతో గుర్తింపు పొందిన కలెక్టర్లలో ఒకరిగా వీపీ గౌతమ్ నిలిచారు. 2021 జూలై20న మహబూబాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు భద్రాచలం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) అధికారిగా ఉమ్మడి జిల్లాలో సేవలందించారు. గిరిజన ప్రాంతం, గిరిజన సమస్యలపై కూడా పట్టుసాధించిన వీపీ గౌతమ్ అదే ఒరవడితో ఖమ్మం కలెక్టర్‌గా రాణించారు.

**ధరణి సమస్యల పరిష్కారంలో మేటి**

ఖమ్మం కలెక్టర్‌గా మొదట్లో ముక్కుసూటిగా వ్యవహరించినా ఆతర్వాత పరిస్థితులను బట్టి కొంత సమన్వయంతో ముందుకు సాగారు. ధరణిలో రైతుల సమస్యల పరిష్కారానికి పగలు రాత్రి శ్రమించారు. హోల్డ్‌లో పడిన భూములను నైపుణ్యంతో పరిష్కరించారు. సర్వేనెంబర్లు, మిగులు భూముల వివరాలు సైతం లెక్కగట్టారు. అసంపూర్తిగా ఉన్న ఖమ్మం కలెక్టరేట్ భవన సముదాయం పూర్తయి, ప్రారంభం కావడంలో ఆయన పాత్ర ఉంది. రాష్ట్ర చరిత్రలో నలుగురు ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్‌రావు, కేజ్రీవాల్, భగవంత్‌మాన్, పినరయి విజయన్ ఆశీస్సులతో కలెక్టర్‌గా కొత్త కార్యాలయ చాంబర్‌లో ఆశీనులు కావడం ఒక అరుదైన సంఘటనగా నిలిచింది. ప్రభుత్వ వైద్య కళాశాల, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీల ప్రారంభానికి ఆయన ప్రత్యేకంగా కృషి చేశారు. ఖమ్మం నగర అభివృద్ధి పనులు, పార్కుల ఏర్పాటు, గోళ్లపాడు చానల్ పనులులో తన మార్క్ చూపించారు.

**వేగం.. ఆయన శైలి..**

మున్నేరు వరదల సమయంలో వేగంగా నిర్ణయాలు తీసుకున్నారు. పగలు, రాత్రి శ్రమించి ప్రాణ నష్టం జరగకుండా నివారించారు. పునరావాస పనులలో శ్రద్ధ వహించారు. గత ప్రభుత్వ హయాంలో చింతకాని మండలంలో దళితబంధు మోడల్‌మండలంగా అన్ని కుటుంబాలకు సాయం అందేలా చొరవ తీసుకోగలిగారు. జిల్లాలో ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కోదాడ, అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారులకు భూసేకరణలోను చురుగ్గానే వ్యవహరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవల జరిగిన లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంలో గౌతమ్ ఎంతో నేర్పుగా వ్యవహరించారు. పోలింగ్‌శాతం పెంపు, యువ ఓటర్ల నమోదులో కీలకంగా ఉన్నారు. మొబైల్ ద్వారా ఓటు వేసే విధాన ట్రయల్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

**పరిపాలనపై పట్టు**

ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం, కిందిస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇవ్వడంలో పరిపాలనపై పట్టు చూపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లానుంచి ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ సమాచారశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వంలో కీలకంగా ఉండడంతో ఈముగ్గురితోను సమన్వయంగా వ్యవహరించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, అర్హులైన వారికి విద్యుత్, సబ్సిడీ గ్యాస్ పథకం అమలు, ఆర్టీసీ ఉచిత ప్రయాణంకు కలెక్టర్ చొరవ తీసుకున్నారు. ఆతర్వాత ఖమ్మం మెడికల్ కాలేజీకి భూమి గుర్తింపు వంటి పనుల్లో చురుగ్గా వ్యవహరించారు. అయితే ప్రభుత్వ, ఎన్నెస్పీ భూముల ఆక్రమణల విషయంలో కొరడా ఝుళిపించినా రాజకీయ వత్తిళ్లతో కొన్ని సందర్భాల్లో చూసీ చూడనట్టుగా వ్యవహరించాల్సి వచ్చింది. ఎంత వత్తిడి ఉన్నా పనిపాలనలో తన మార్కు చూపింపారు. సుదీర్ఘకాలం పాటు పనిచేయడం ప్రభుత్వం మారడం, రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టడంతో వీపీ గౌతమ్‌కు కూడా బదిలీ తప్పనిసరైంది. అయితే రాష్ట్రస్థాయిలో కీలకశాఖల్లోనే ఆయనకు బాధ్యతలు ఇచ్చే అవకాశం లేకపోలేదు.



మాజీ ఎంపీ డాక్టర్ కేవీపీ రామచందర్‌రావును సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

## 'రోటరీ' సేవలు మరింత విస్తరించాలి

- మాజీ ఎంపీ డాక్టర్ కేవీపీ రామచంద్రరరావు

భద్రాచలం, జూన్ 16: రెండు తెలుగు రాష్ట్రాల్లో రోటరీ ద్వారా అందిస్తున్న సేవలు శ్లాఘనీయని అవి మరింతగా విస్తరించాలని మాజీ ఎంపీ డాక్టర్ కేవీపీ రామచందర్ రావు ఆకాంక్షించారు. భద్రాచలంలో శనివారం రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 కాన్ఫరెన్సు అవార్డుల మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వృద్ధులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తన దృష్టికి వచ్చిందని వారిని రోటరీ సంస్థ అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వీలైనన్ని వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసి అండగా నిలవాలని సూచించారు. వైకుంఠదామాల నిర్మాణాలపై సైతం రోటరీ సంస్థ దృష్టి నిలపాలన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ రోటరీ సంస్థ ద్వారా భద్రాచలం ఏజెన్సీలో అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావును ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, రోటరీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

రెండు తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ 3150 జిల్లా గవర్నరు డా. బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రోటరీ సంస్థకు పది ఎకరాల స్థలం హైదరాబాద్‌లో కేటాయిస్తే వృద్ధాశ్రమంతో పాటు నిరుపేదలకు వైద్య పరీక్షల కోసం వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, యువతకు స్కిల్‌డెవలప్‌మెంటు సెంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ యూనిట్ హెడ్ ప్రణవ్ శర్మ, రామకృష్ణమఠం నుంచి అనుపమానంద స్వామి రోటరీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు శ్యామ్ ముఖ్వా, వీరభద్రరెడ్డి, శ్యామ్‌పాటిబండ్ల పాల్గొన్నారు.

### సీవీకే రావు సేవలు చిరస్మరణీయం

చర్ల, జూన్ 15: ప్రజలు మెచ్చిన, నచ్చిన మనిషి సీవీకే రావు (చింతల చెర్వువెంకటాద్రి) అని, ఆయన ఏజెన్సీకి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ కేవీపీ రాంమచంద్రరావు అన్నారు. శనివారం చర్ల మండల వచ్చిన ఆయన రైస్ పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

చర్ల ప్రాతం అంటే సీవీకేరావు గుర్తుకు వస్తారని తెలిపారు. విద్యావేత్తగా, దాతగా అనేక మందికి ఆయన సాయం చేశారన్నారు. అంతకు ముందు చర్ల గ్రంథాలయంలోని సీవీకేరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షులడు పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, చీమల మర్రి మురళీ కృష్ణ, ఆవుల విజయభాష్కర్ రెడ్డి, చీమకుర్తి భద్రం, పండు, ఇర్పాశాంత, గుండేపూడి సతీష్, తోటమళ్ల వరప్రసాద్, ఇతర నాయకులు ఉన్నారు.

### ఆర్టీసీ ఆర్ఎంగా సరిరాం

**ప్రస్తుత ఆర్ఎం వెంకన్న హైదరాబాద్‌కు బదిలీ**

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 15: ఉమ్మడి ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌గా అజ్మీరా సరిరాంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం తెలంగాణ స్టేట్‌రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో డీవీఎంగా పనిచేస్తున్న సరిరాం పదోన్నతిపై ఖమ్మం రీజనల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. గతంలో 2011జూన్ నుంచి 2012 జూన్ 8 వరకు సరిరాం ఖమ్మంలో డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఖమ్మం ఆర్ఎంగా ఉన్న సీహెచ్ వెంకన్నను హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. 2023 జూలైలో ఉద్యోగ బాధ్యతలు ఆర్ఎం వెంకన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు పాత బస్టాండ్‌లను వాడుకల్లోకి తేవటంలో ఎంతో కృషి చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తీర్చటంతో ముందున్నారు. నూతన ఆర్ఎం సరిరాం మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

### పుట్టింటికి నడిపించిన..

# గెలుపు 'బాబు'టా

- సీబీఎన్ గెలిస్తేనే వస్తానని గతంలో శపథం
- ఐదేళ్ల తర్వాత ఆడబిడ్డకు ఘన స్వాగతం

కూసుమంచి, జూన్ 15: 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గెలుస్తారని, తిరిగి అధికారం చేజిక్కించుకుంటారని.. లేదు లేదు.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని జరిగిన చర్చ.. శపథానికి దారి తీసింది. బాబు గెలిచేవరకు పుట్టినింట్లో అడుగు పెట్టనంటూ చేసిన శపథం ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత నెరవేరింది. చంద్రబాబు గెలుపు కోసం పుట్టినింటి వారిని వదులుకుని మెట్టినింటికే పరిమితమైన ఆ ఇల్లాలుకు గ్రామమంతా జననీరాజనం పలికింది. పూలతో హారతులతో స్వాగతం పలికింది.

ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన కట్ట విజయలక్ష్మి వారి కుటుంబసభ్యుల మధ్య 2019లో రాజకీయ ఒప్పందం జరిగింది. చంద్రబాబు తిరిగి అధికారంలోకి వస్తారని ఒకరు.. కాదు వైఎస్ జగనే గెలుస్తారని కుటుంబసభ్యుల్లో ఒకరికొకరు పందెం పెట్టుకున్నారు. జగన్ గెలిస్తే ఐదేళ్లపాటు తాను పుట్టింటికి రానంటూ విజయలక్ష్మి శపథం చేసింది. దీంతో జగన్ అధికారంలోకి రావడంతో ఐదేళ్లపాటు పుట్టింటిని వదులుకుంది. తిరిగి 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టడంతో విజయలక్ష్మి కల నెరవేరింది. ఐదేళ్ల తర్వాత శనివారం విజయలక్ష్మి పుట్టింటికి రావడంతో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు నీరాజనం పలికారు. శాలువాలతో సత్కరించి, పూలబొకే అందించి, పూలజల్లులతో, హారతులు ఇచ్చి



ఎన్టీఆర్ విగ్రహ ప్రాంగణంలో విజయలక్ష్మిని సన్మానించిన కుటుంబం

స్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి అక్కడే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చంద్రబాబు నాయుడుపై విశ్వాసం ఉంచిన ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించి అధికారంలోకి తీసుకరావడం ఆనందంగా ఉందన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని, దేశ రాజకీయాల్లో ఒక గుర్తింపు తెచ్చుకున్నా నాయకుడని, ఆంధ్రలో ఇక అభివృద్ధి పథంతో దూసుకపోతుందని ఆకాంక్షించారు.

## 'విత్తు'పై ప్రైవేటు పెత్తనం

- కొమరారం రైతులపై డీలర్ల కన్నెర్ర
- విత్తనాలు అమ్మవద్దని డీలర్ల నిర్ణయం
- భగ్గుమంటున్న రైతులు

ఇల్లెందు రూరల్, జూన్ 15: ఇల్లెందు మండలం కొమరారం రైతులపై విత్తన డీలర్లు కన్నెర చేశారు. కొమరారం ప్రాంత రైతులకు విత్తనాలు అమ్మవద్దని ఇల్లెందు పట్టణ డీలర్ల నిర్ణయించినట్లు తెలుస్తుంది. రెండు రోజులుగా కొమరారం రైతులకు, విత్తనా డీలర్ల మధ్య సోషల్ మీడియాలో ఆరోపణలు, ప్రత్యారోపణాలు సాగుతున్నాయి. విత్తనాలు అమ్మని డీలర్లు తమ గ్రామానికి రావద్దని కొమరారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంట సమయంలో కొమరారం రైతులు నకిలీ విత్తనాల మూలంగా నష్ట పోయామని ధర్నాలు ఆందోళనలు చేయడంతో ప్రభుత్వం వ్యవసాయ శాస్త్రవేత్తలతో పరిశీలన చేసింది. అయినప్పటికి రైతులకు న్యాయం జరగలేదు. విత్తనాల డీలర్ల మూలంగానే తమకు నకిలీ విత్తనాలు అంటకట్టారని వారిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు, డీలర్లకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో కొమరారం రైతులకు విత్తనాలు అమ్మవద్దని ఇల్లెందు పట్టణ డీలర్లు నిర్ణయించినట్లు సమాచారం. ఒక వేళ కొమరారం రైతులకు విత్తనాలు అమ్మినా బిల్లులు ఇవ్వవద్దని ఇల్లెందు పట్టణంలోని డీలర్లు నిర్ణయించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

కొమరారం గ్రామానికి చెందిన రైతులకు శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని ఆంబజార్‌లో ఉన్న ఒక విత్తన దుకాణదారు విత్తనాలను విక్రయించేది లేదని తేల్చిచెప్పారని సమాచారం. ఈ క్రమంలో కరపత్రాలతో రైతులు, విత్తన డీలర్లు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు.

**తప్పుడు ప్రచారం... నమ్మకండి**

ఈ విషయం వ్యవసాయశాఖకు తెలియడంతో విత్తన డీలర్ల సంఘం ఈ వ్యవహారాన్ని ఖండించింది. డీలర్లు ఎవరూ కొమరారం రైతులకు విత్తనాలు ఇవ్వబోమని చెప్పలేదని, తప్పుడు ప్రచారం నమ్మవద్దని ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరావు రైతులను కోరారు.

**రైతులను ఇబ్బంది పెడితే చర్యలు**

ఈ విషయంపై ఇల్లెందు మండల వ్యవసాయశాఖాధికారి సతీష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కొమరారం రైతులకు విత్తనాలు అమ్మవద్దని డీలర్లు తీర్మానించినట్లు జరుగుతున్న ప్రచారం తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేస్తున్నామని, రైతులను ఇబ్బందులు పెట్టే చర్యలను క్షమించబోమని, వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

### బదిలీపై వెళ్లిన కలెక్టర్‌కు సన్మానం



గౌతమ్‌ను సత్కరిస్తున్న నెలనెలా వెన్నెల నిర్వాహకులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 16: బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను శనివారం నెల నెలా వెన్నెల నిర్వాహకులు వీడ్కోలు పలికారు. శనివారం సాయంత్రం ఆయనను కలిసి శాలువలతో ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్‌గా తనదైన ముద్ర వేసిన వీపీ గౌతమ్‌కు నెల నెలా వెన్నెల నిర్వాహకులు డాక్టర్ నాగబత్తిన రవి, అన్నా బత్తుల సుబ్రహ్మణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్ వీడ్కోలు తెలిపారు. కళాకారుల పట్ల ఆదరించారని అన్నారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో సౌకర్యాలు కల్పించడంలో సాంస్కృతిక కార్యక్రమాలు పెరిగాయని జిల్లాతో ఆయన అనుబంధం మరువలేనిదని అన్నారు.

### మళ్లీ వస్తా.. మీ అభివృద్ధిని చూస్తా

- ఐటీడీఏ పీవోకు ఆదివాసీల కన్నీటి వీడ్కోలు



ఆదివాసీలతో మాట్లాడుతున్న పీవో ప్రతీక్ జైన్

దుమ్ముగూడెం, జూన్ 15: మళ్లీ వస్తాను... చుట్టుపక్కల జిల్లాలో ఎక్కడున్నా ఏదో ఒక రోజు మీ గ్రామాలకు వచ్చి మీ ఆర్థికాభివృద్ధిని చూస్తానని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. తన స్థానంలో వచ్చే అధికారులు ప్రాజెక్టును పూర్తి చేస్తారని ఆదివాసీ రైతులకు తెలిపారు. వ్యవసాయం ద్వారా ఆదివాసీలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును రూపొందించి యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ బదిలీ ఎన్‌లక్ష్మీపురం, సింగవరం ఆదివాసీలకు ఒకింత బాధను మిగిల్చింది. బదిలీ విషయం తెలిసిన తర్వాత పీఓ తన కలల ప్రాజెక్టును ఆదివాసీ రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులతో చివరిసారిగా శుక్రవారం మాట్లాడారు. ఆదివాసీ రైతుల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలో రెండు చోట్ల రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రాజెక్టులు చేపట్టగా, ఒకటి దుమ్ముగూడెం మండలం సింగారం గ్రామపంచాయతీ, మరొకటి అశ్వారావుపేట మండలం నందిపాడు గ్రామపంచాయతీను ఎంపిక చేశారు. కాగా ప్రాజెక్టులో భాగంగా దుమ్ముగూడెం మండలంలోని సింగవరం, ఎన్ లక్ష్మీపురం గ్రామాల్లోని 117 మంది రైతులకు రూ.18లక్షలతో చేసిన విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు. పంటలు పండించి ఆర్థిక స్వయం సమృద్ధి పొందాలని ఆదివాసీ రైతులకు సూచించారు. ఏళ్ల తరబడి ఐటీడీఏ నుంచి తమని ఇంతగా ఎవరూ ప్రోత్సహించలేదంటూ ఆదివాసీ రైతులు ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. పీవోకు ఈ సందర్భంగా చిరు సన్మానం చేశారు. రెండు గ్రామాల ఆదివాసీ రైతులు ఏడీ భాస్కరన్, ఏపీవో మునీర్ బాషా, డీఈ జీవన్‌కుమార్, ఏడీ వేణు తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా ఇసుక రవాణా

- గోదావరిలో తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు
- సమాచారమిచ్చినా పట్టించుకోని అధికారులు

అశ్వాపురం, జూన్ 15: అక్రమార్కులు గోదావరిలోని ఇసుకను తోడేస్తున్నారు. యంత్రాలు, కూలీల సాయంతో ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రేయింబవళ్లు ఇసుక తరలిస్తున్నా అధికారులు చోద్యం చూడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేవుల వద్ద అధికారులు కందకాలు తవ్వించినా అక్రమార్కులు కొద్దిగంటల్లోనే కందకాలను పూడ్చి అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండల పరిధిలోని చింతిర్యాల, అమ్మగారిపల్లి, అమెర్దా గాదావరి రేవుల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఒక్కో ఇసుక ట్రాక్టర్ దూరాన్ని బట్టి రూ.1,500 నుంచి రెండు వేల వరకు ధర పలుకుతుండటంతో అక్రమార్కులు రూ. లక్షలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గోదావరి నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా పూచికపుల్లకూడా బయటకు తీసుకురావద్దనే నిబంధనలున్నా అక్రమార్రులు ఏమాత్రం కాతరు చేయటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక అక్రమ రవాణా పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవటం కారణంగానే అక్రమార్కులకు కల్పతరువుగా మారిందని ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాపై అధికారులకు సమాచారమిచ్చినా.. వెంటనే కొందరు అధికారులు ఈవిషయాన్ని అక్రమార్కులకు తెలియజేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారుల పాత్రకూడా అక్రమ రవాణాలో ఉందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మరోవైపు గ్రామాల్లో కూడా పెద్ద ఎత్తున అక్రమార్కులు డంపులు ఏర్పాటు చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో అక్రమ రవాణాపై పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేసి అక్రమార్కులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



చింతిర్యాల రేవు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

## 19న తల్లాడలో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు

తల్లాడ, జూన్ 15: తల్లాడలో ఈనెల 19న జరిగే కౌలు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవన్‌లో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 శాతానికి పైగా కౌలు వ్యవసాయంపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారన్నారు. వారి ద్వారా లక్షలాదిమందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కౌలు రైతుల సమస్యలను రాష్ట్ర సదస్సులో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యానారాయణరెడ్డి, పకీరమ్మ, ఐనాల రామలింగేశ్వరరావు, షేక్.మస్తాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవీన్(ఫైల్)

చుంచుపల్లి, జూన్15: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చుంచుపల్లిలో మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామానికి చెందిన ఇనుమల నవీన్(35) ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా విద్యానగర్ బైపాస్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి వారు చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవీన్ మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, యజమానిని కోల్పోయిన కుటంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, కౌన్సిలర్‌లు యూసుఫ్, సత్యనారాయణచారి ఉన్నారు.

## చికిత్స పొందుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ..



నరసింహరావు

అశ్వారావుపేట రూరల్, జూన్ 15: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన నారంవారిగూడెంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలం లోకవరం గ్రామానికి చెందిన కోలా నరసింహరావు(40) అశ్వారావుపేటలోని మిషన్ భగీరథ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో కొంత కాలంగా ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీ రాత్రి విధులు ముగించుకుని లారీలో ఇంటికి బయలుదేరాడు. మండలంలోని నారంవారిగూడెం సమీపంలో ఆగి ఉన్న లారీని వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న అతడితో పాటు మరో ఉద్యోగి రాంబాబు, వ్యాన్ డ్రైవర్ శ్రీనులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం నర్సింహారావును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్థరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. అశ్వారావుపేట ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో మహిళ..



రమణమ్మ

పినపాక, జూన్ 15: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దెల రమణమ్మ(45) వ్యవసాయ సీజన్ ఆరంభం సందర్భంగా కొత్తల పండుగ నేపథ్యంలో ఇంటిని శుభ్రం చేసుకునేందుకు విద్యుత్ మోటార్ స్విచ్ ఆన్ చేసి తన ఇంటిని పైపుతో కడిగిన అనంతరం విద్యుత్ మోటార్ స్విచ్ ఆఫ్ చేసేందుకు వెళ్లిన క్రమంలో విద్యుదాఘాతంతో కిందపడిపోయింది. గమనించిన ఆమె కుమార్తె వెంటనే 108 సాయంతో పినపాక ప్రభుత్వాసుపత్రికి తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం, మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందిందని ధ్రువీకరించారు. ఆమె భర్త, పెద్ద కుమార్తె గతంలోనే మృతి చెందారు. చిన్న కుమార్తె స్పందనను కూలీ పనులు చేసుకుంటూ ఉన్నత చదువులు చదివిస్తోంది. కుమార్తె స్పందన ఫిర్యాదు మేరకు ఏడూళ్లబయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి, పంచనామా నిర్వహించారు.

## ఫుడ్‌పాయిజన్‌తో యువకుడు..



సాయిరాహుల్

దుమ్ముగూడెం, జూన్ 15: ఫుడ్ పాయిజన్ కారణంతో తీవ్ర అనారోగ్యానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్ముగూడేనికి చెందిన బైరెడ్డి సాయిరాహుల్(24) ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా పది రోజుల క్రితం ఫుడ్ పాయిజన్ కారణంగా తీవ్ర అనారోగ్యానికి లోనయ్యాడు. హైదరాబాదులో వైద్యచికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. అందరితో కలిసిమెలిసి ఉండే యువకుడు రాహుల్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## బావిలో పడిన వృద్ధుడిని కాపాడిన ఫైర్ సిబ్బంది

ఖమ్మంక్రైం, జూన్15: ప్రమాదవశాత్తూ బావిలో పడిన వృద్ధుడిని ఖమ్మం అగ్నిమాపక సిబ్బంది శనివారం కాపాడారు. నగరంలోని 29వడివిజన్ సుందరయ్యనగర్‌కు చెందిన పల్లేల విశ్వరూపాచారి(60) అనే వృద్ధుడు తన నివాసం ఉంటున్న ఇంటిలో ఉన్న ఒరల బావిలో ప్రమాదవశాత్తూ పడ్డాడు. దీంతో అతను కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్‌వో రాజేశ్వరరావు, ఎల్ఐఎఫ్ రామారావు, డీవోపీ ఎస్‌కే ఫయాజుద్దీన్, ఎఫ్ఎల్ఎం వీరస్వామి, హెచ్‌జీ విజయ్‌కుమార్‌లు చేరుకుని తాడు సాయంతో బావిలోకి దిగి అతడిని కాపాడి బయటకు తీసుకువచ్చారు. బావిలో పడడంతో సదరు వృద్ధుడి కి స్వల్పగాయాలయ్యాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు, అగ్నిమాపక సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



బావిలోపడిన వ్యక్తిని కాపాడిన ఫైర్‌సిబ్బంది

## ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని రక్షించిన పోలీసులు

ఖమ్మం క్రైం, జూన్15: ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని త్రీటౌన్ పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాంతానికి చెందిన సముద్రాల అనిల్ తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. శనివారం ఖమ్మం వచ్చిన యువకుడు రైల్వే ట్రాక్‌పై చనిపోతున్నానంటూ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపాడు. అది చూసిన తండ్రి వెంటనే జమ్మికుంట పోలీసులను సంప్రదించగా, వారు సెల్‌ఫోన్ లోకేషన్ ఖమ్మం రైల్వే సమిపంలోని ట్రాక్ పై చూపించింది. దీంతో పోలీసులు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సీఐ ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించి వారి సహకారంతో సంఘటన స్థలం వద్దకు వెళ్లి యువకుడిని గుర్తించారు. అనంతరం అతడిని కాపాడి స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా యువకుడిని కాపాడటంతో పోలీస్ ఉన్నతాధికారులు, స్థానికులు త్రీటౌన్ సీఐ రమేష్‌ను అభినందించారు.

## రెండు లారీలు ఢీ..ఒకరి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జైన లారీలు (ఇన్‌సెట్‌లో రమేష్) (ఫైల్)

అశ్వారావుపేట రూరల్, జూన్ 15: ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన అశ్వారావుపేట మండలంలోని శ్రీరంగాపురం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు నుంచి ఒరిస్సాకు సిమెంటుతో వెళుతున్న లారీ, మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఖమ్మం వైపు వెళుతున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీల క్యాబిన్‌లు నుజ్జు నుజ్జు అయ్యాయి. ప్రమాదంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన లారీ డ్రైవర్ సుంకే రమేష్(40) అక్కడిక్కడే మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా ఆర్వూర్‌కు చెందిన సిమెంటు లారీ డ్రైవర్ భయ్యా మధు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న సీఐ జితేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని, దాదాపు గంటపాటు శ్రమించి లారీ డ్రైవర్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై అత్యాచారం

పాల్వంచ, జూన్ 15 : మైనర్ బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక తన తల్లిదండ్రులతో కలిసి అద్దెకు ఉంటుంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఇంట్లో లేరని తెలుసుకున్న ఓ యువకుడు బాలిక పై అత్యాచారం యత్నానికి పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన మైనర్ తల్లిదండ్రులు విషయం తెలుసుకుని పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## రిజర్వేషన్ల పరిరక్షణకు ఉద్యమించాలి



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్15: ప్రస్తుత సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు రిజర్వేషన్ పెంపుదలకు ఉద్యమించాలని పలువురు వక్తలు కోరారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో రిజర్వేషన్ల చరిత్ర, నేపథ్యం అమలు, నేడు రిజర్వేషన్లు ఎదుర్కొంటున్న సమస్యలు సవాళల అనే అంశాలపై ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్ అధ్యక్షతన జరిగినసదస్సులో పలువురు మాట్లాడారు. అనంతరం ప్రముఖసామాజికవేత్త డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్ మాట్లాడతూ రిజర్వేషన్ల పరిరక్షణ పెంపుదల కన్న ముందు కుల గణన చేపట్టాలని కోరారు. సామాజిక నర్యాయ వేదిక జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ వై.ప్రభంజన్‌యాదవ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల పూర్వ చరిత్రను అవలోకనం చేసుకుని ప్రస్తుత పరిస్థితులను గమనిస్తూ రాజ్యాధికారం కోసం పోరాడాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీచైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ దేశంలో జనకుల గణన జరగాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, ఉపాధ్యక్షుడు బద్రునాయక్, సజీమా, ఉపేంద్రాబయి పాల్గొన్నారు.

# మార్క్సిజంతోనే పురోగమనం

- సంస్థాగత నిర్మాణమే లక్ష్యంగా కార్యచరణ
- ప్రజా సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 15: మార్క్సిజంతోనే దేశం పురోగమిస్తోందని మరో ప్రత్యామ్నాయ మార్గం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ రెండో రోజు శిక్షణా కార్యక్రమాల్లో ముఖ్య వక్తగా కూనంనేని ప్రసంగించారు. కమ్యూనిజమే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుదన్నారు. భారతదేశంలో పలు అంశాలు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రజల నిస్పష్టమైన అభిప్రాయం ఎన్నికల సమయంలో బహిర్గతం కావడం లేదన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ఏదో ఒక అంశం ఓటర్లను ప్రభావితం చేస్తుందని వివరించారు. పాలన పద్ధతులు, అట్టడుగు వర్గాల సంక్షేమం, ఆర్థిక విధానాలు, అభివృద్ధి ఎన్నికల్లో చర్చకు రావడం లేదని వివరించారు. సిద్ధాంతం లేకుండా కొన్ని బూర్జువా పార్టీలు పని చేస్తున్నాయని, కమ్యూనిస్టు సిద్ధాంతం మాత్రమే ప్రజల అవసరాలపై పోరాటాలు చేస్తోందన్నారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని ఇది భవిష్యత్‌లో ఆశాంతికి కారణమైతుందన్నారు. కమ్యూనిజమే దేశానికి ప్రత్యామ్నాయంగా నిలుస్తోందని తెలిపారు. జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజా సంఘాలు బలోపేతం ద్వారా పార్టీ విస్తరణ పెరుగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు మరికొంత కాలం పాటు బూర్జవ పార్టీలతో పొత్తు కొనసాగించాల్సి ఉంటుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, మహ్మద్ మౌలానా, దండి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మదర్‌థెరిస్సా విద్యార్థికి స్థానం

- మోస్ట్ చైన్ లింక్ పోటీలో 8దేశాలతో పోటీపడిన గౌరీశంకర్



గౌరీశంకర్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, జూన్15: ప్రతిష్ఠాత్మక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో సత్తుపల్లిలోని కొత్తూరు గ్రామానికి చెందిన మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి గుమ్మడిదల గౌరీశంకర్ స్థానం సాధించాడు. ఈ ఏడాది జనవరి 1వ తేదీన మొత్తం 8దేశాలతో పోటీ పడిన గౌరీశంకర్ మోస్ట్ చైన్ లింక్స్ పోటీలో పాల్గొని ఈ రికార్డును సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ శనివారం తెలిపారు. మొత్తంగా 1125చైన్ లింక్స్‌ను ఒక సంవత్సర కాలవ్యవధిలో సాధించి గతంలో తాను నెలకొల్పిన 617లింక్‌లను తానే అధిగమించాడు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఎస్‌కే.జాకీర్‌హుస్సేన్, డీన్ డిప్లొమా డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, ఈఈఈ విభాగ అధిపతి డాక్టర్ వై.రాజశేఖరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్రామీణ మహిళల కోసం క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం



మాట్లాడుతున్న భీమవరపు పుల్లారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 15: గ్రామీణ మహిళలకు క్యాన్సర్ వంటి ప్రాణంతకమైన వ్యాధులకు ప్రకాష్ ప్రాజెక్టు, బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భీమవరపు పుల్లారావు, వై శ్రీనివాసరావు, బత్తినేని స్వాతి వివరించారు. శనివారం విక్రమ్ అధ్యక్షతన మంచికంటి భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఖమ్మంలో క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించి పది మంది మహిళలను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించటంలో సహాయం అందించామన్నారు. మహిళల కోసం జూలై6న శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. నిర్వాహకులు బోడపట్ల సుదర్శన్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# పరిమితికి మించి వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

- ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన జాతీయ వైద్య బృందం

జూలూరుపాడు, జూన్ 15: పరిమితికి మించి ఆర్ఎంపీలు వైద్యం అందిస్తే ఎన్ఎంసీ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని జాతీయ వైద్య బృందం సభ్యులు హెచ్చరించారు. శనివారం జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిని జాతీయ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించి, ఆర్ఎంపీ వైద్యుడు వద్ద నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. సదరు వైద్యుడు పరిమితికి మించి వైద్య సేవలు అందిస్తున్నట్టు బృందం సభ్యులు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రజలకు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్‌ను అందించడంతో వారు కిడ్నీ వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారని తెలిపారు. ఆర్ఎంపీలు నిబంధనలకు లోబడి వైద్య సేవలను అందించాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో 9 మంది బృందం సభ్యులు పర్యటించి 50 ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించి మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా జాతీయ బృందం సభ్యులు తనిఖీకు వచ్చారన్న సమాచారాన్ని తెలుసుకొని జూలూరుపాడులోని ఆర్ఎంపీలు ఆసుపత్రులను, ఔషధ దుకాణాలను మూసివేయడం గమనర్హం.



జూలూరుపాడులోని ప్రైవేట్ ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న జాతీయ బృందం సభ్యులు

ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సురేష్, డాక్టర్ మహేష్, డాక్టర్ విష్ణు, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లు పంపుతున్న మెసేజ్‌లకు స్పందించవద్దు

- సీపీ సునిల్‌దత్

ఖమ్మంక్రైం, జూన్15: సైబర్ నేరగాళ్లు పంపుతున్న లింక్‌లకు, మెసేజ్‌లకు స్పందించవద్దని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ యూనో యాప్ అప్లికేషన్ ఉపయోగిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్‌నేరగాళ్లు లింక్‌లు, మెసేజ్‌లు పంపుతున్నారని, వాటికి స్పందించి మోసపోవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల డేటాలో ఉన్న ఫోన్ నెంబర్ల ఆధారంగా మీ అకౌంట్‌లో రివార్డు నగదు జమవవుతుందని కేవైసీ అప్‌డేట్ కాలేదని పలురకాల మెసేజ్‌లు పంపుతూ మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల ఆశచూపి వల వేస్తుంటారని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌లో ఏదైనా స్కీంల గురించి చెబితే అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే సైబర్ క్రైం టోల్‌ఫ్రీనెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే నగదు రికవరీ చేసే అవకాశాలున్నాయని ప్రకటనలో తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట, జూన్14: నాగుపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అదుపులోకి తీసుకొని వారిపై శనివారం కేసు నమోదు చేశారు. నాగుపల్లి గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. ఈదాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,140ల నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాల్వంచ: పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. మండల పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిలో నలుగురు పరారవగా, ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.11,420 స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

● సింగరేణి సీఎండీ బలరాం



రుద్రంపూర్, (సింగరేణి) జూలై 15 : సింగరేణిలో జరిగే మెడికల్ బోర్డులో కార్మికులు దళారులను నమ్మి మోసపోవద్దని సింగరేణి కాలరీస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం కోరారు. సింగరేణి మెడికల్‌బోర్డులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ కావడం కోసం కొంతమంది కార్మికులు దళారులను ఆశ్రయిస్తూ, ఆర్థికంగా నష్టపోతున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ), సీఐడీ విభాగాలకు ఫిర్యాదులు చేసిగతంలో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏదైనా సవచారం ఉంటే సింగరేణి విజిలెన్స్ అధికారులకు 94911 44104కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దేశంలో పెట్టుబడిదారులదే పెత్తనం

- ప్రొఫెసర్ యుగల్ రాయల్
- ముగిసిన సీపీఐ జిల్లా స్థాయి శిక్షణా తరగతులు

పాల్వంచ టౌన్, జూన్ 15 : దేశంలో పెట్టుబడిదారులదే పెత్తనంగా పాలకులు పాలన సాగిస్తున్నారని ప్రొఫెసర్ యుగల్ రాయల్ ఆరోపించారు. సీపీఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ముగింపు సభలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో వ్యవస్థ గాడి తప్పుతోందని, పేదలు ఇంకా పేదలు గానే ఉన్నారని, సంపన్నలు మరింత సంపన్నలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని, అలాంటి యువత బతుకులు గాలిలో దీపాలుగా మారిపోయాయని తెలిపారు. పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని అన్నారు. మరో అతిథి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టులు బలపడితేనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో దేశ ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా తమ రాజకీయాలను తిరస్కరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు బొల్లోజ అయోధ్య, ముత్యాల విశ్వనాథం, నాయకులు బ్రహ్మం, పుల్లారెడ్డి, చంద్ర నరేంద్రకుమార్, పట్టణ, మండల కార్యదర్శులు సాయిబాబు, ఎ. పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుగల్ రాయల్

# నిరుద్యోగులు అవకాశాలను వినియోగించుకోవాలి

- జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత
- జాబ్‌మేళాకు 220 మంది అభ్యర్థులు హాజరు

చుంచుపల్లి, జూన్15: నిరుద్యోగ అభ్యర్థులు తమకు వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత సూచించారు. శనివారం జిల్లా ఉపాధి కల్పన అధికారి శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా ఆమె మాట్లాడారు. తక్కువ సమయంలో జాబ్ మేళాను ఏర్పాటు చేసేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అపోలో ఫార్మసీ, సాయి అంజనా మోటార్స్ కంపెనీలలో ఉద్యోగాల భర్తీకి ఈ జాబ్ మేళాను నిర్వహించగా విశేష స్పందన లభించిందన్నారు. మొత్తం-220 మంది అభ్యర్థులు పాల్గొనగా, 102మంది అభ్యర్థులు ఎంపిక అయ్యారని తెలిపారు. వారిలో 92మంది అపోలో ఫార్మసీకి, 10మంది సాయి అంజనా మోటార్స్ ఎంపికయ్యాయన్నారు. అనంతరం వారికి వెంటనే నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, నిరుద్యోగ అభ్యర్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న ఉపాధి కల్పన అధికారిని విజేత



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగ అభ్యర్థులు

## పంచాయతీ ట్రాక్టర్ బోల్తా... కార్మికుడికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు, జూన్ 15: ప్రమాదవశాత్తూ పంచాయతీ ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో పంచాయతీ కార్మికుడికి గాయాలైన సంఘటన సారపాకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..సారపాక గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌లో గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం చెత్తను సేకరించేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ పరిధిలోని భాస్కర్‌నగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న పంచాయతీ కార్మికుడు రవికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పంచాయతీ అధికారులు భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

## విద్యుదాఘాతంతో మేక మృత్యువాత

సత్తుపల్లిరూరల్, జూన్15: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన సంఘటన శనివారం సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో చోటుచేసుకుంది. విద్యుత్ శాఖ ఏఈ శరత్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఈర్ల శ్రీనుకు చెందిన సుమారు రూ.15వేల విలువగల మేక సమీపంలోని మేతకు వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ (కుండ ట్రాన్స్‌ఫార్మర్) కింద వర్షం రావడంతో ఎర్త్‌కు త్రీఫేజ్ కరెంట్ రావడంతో ప్రమాదవశాత్తూ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు సేకరించి నేడు పంచనామా నిర్వహించనున్నట్లు ఏఈ తెలిపారు.

## శ్రీశ్రీ కి ఘన నివాళి


శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, విద్యావేత్తలు

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 15: మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా శనివారం ఖమ్మం బైపాస్ రోడ్‌లోని శ్రీశ్రీ విగ్రహం వద్ద కవులు, విద్యావేత్తలు, విద్యా సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు రవి మారుత్, ఐవీ రమణారావు, వీరారెడ్డి, కాంతారావు, న్యూవిజన్ ప్రసాద్, వీరన్న, శేషగిరి తదితరులతోపాటు కవులు షుకూర్ , ఎంవీ రమణ, ఇబ్రహీం నిర్గున్, కటుకోజ్వల రమేష్, రౌతు రవి, జామవా సాహిత్య వేదిక కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కవి దేవేంద్ర రచించిన శ్రీశ్రీ స్మారక గీతాన్ని ప్రముఖ గాయకుడు సదానంద్ ఆలపించారు.

# మురుగు కాల్వల్లో చెత్తా వేస్తే జరిమానా

- వర్షాకాలం ముందస్తు జాగ్రత్తలు చేపట్టండి
- పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడండి
- మునిసిపల్ అధికారులకు మేయర్ ఆదేశం


సమావేశం నిర్వహిస్తున్న మేయర్

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 15: మురుగు కాల్వల్లో చెత్తా చెదారం వేసి మురుగు నీటి ప్రవాహానికి అవరోధం కలిగించటం ద్వారా నగరంలో అపరిశుభ్ర సమస్యకు కారణమయ్యే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించాలని, నగర మేయర్ పునుకొల్లు నీరజ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో సహాయ కమిషనర్ సంపత్ కుమార్, తదితర కార్పొరేషన్ శానిటేషన్ అధికారులు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే క్షమించేది లేదన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలకు పారిశుధ్య సమస్య రానీయకుండా చూడాలన్నారు. వానాకాలం ముందస్తు చర్యలు చేపట్టటం ద్వారా నగర పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

### వాకర్స్ పారడైజ్ సందర్శించిన మేయర్

నగర మేయర్ పునుకొల్లు నీరజ శనివారం నగర పర్యటనలో భాగంగా వాకర్స్ పారడైజ్‌ను సందర్శించారు. ట్రాక్ చుట్టూ ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలన్నారు. కోతులు, కుక్కల బెడద నివారించాలని, ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టాలని చెప్పారు. 41వ డివిజ్‌లో పెద్ద మురుగు కాల్వను స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణతో కలిసి పరిశీలించారు. సిల్టును తొలగించాలని ఇందుకోసం గ్యాంగ్ వర్క్ చేయించాలన్నారు. 11 వ డివిజన్‌లో మురుగు కాల్వ పూడిక తీతను పరిశీలించారు.

## జాలిముడి కాలువ బుంగ మరమ్మతులకు
# నాసిరకం మట్టి

- ఆగ్రహం వ్యక్తంచేస్తున్నరైతులు
- అధ్వానంగా రహదారి..
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- నాణ్యమైన మట్టి వాడాలని డిమాండ్


నాసిరకం మట్టితో పూడ్చిన గండి

బోనకల్, జూన్ 15: మండలంలోని రాపల్లి గ్రామ సమీపంలో రైతుల పొలాలకు వెళ్లే జాలిముడి కాలువ బుంగ మరమ్మతు పనులకు నాసిరకం మట్టి తోలకాలు జరపడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం రాపల్లి వద్ద జాలిముడి కాలువకు గండి పడటంతో కట్ట కోతకు గురైంది. అప్పట్లో అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో రైతులే స్వయంగా మట్టిని తీసుకొచ్చి గండిని పూడ్చారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మరోసారి రైతులు జిల్లా ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. వారం రోజుల క్రితం ఓ కాంట్రాక్టరు గండి వద్ద బుర్రను వేసి, మట్టి పోశారు. రైతులు మాత్రం గండి వద్ద వేసిన బుర్రపై నాణ్యమైన గ్రావెల్ పోస్తేనే భవిష్యత్‌లో కోతకు గురికాదని వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కాని అక్కడే ఉన్న నల్లరేగడి మట్టితో నింపడంతో వర్షానికి చిత్తడిగా మారింది. రైతులు తమ పొలాలకు రాకపోకలు సాగించడానికి సైతం వీలుకాని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు అక్కడ తోలకాలు జరిపిన మట్టి వర్షానికి తొందరలోనే కొట్టుకుపోతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి బుంగ పై పోసిన నాసిరక మట్టిని తొలగించి నాణ్యమైన గ్రావెల్‌తో మరమ్మత్తు పనులను పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు.

## కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

సత్తుపల్లి, జూన్ 15: సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు, పెనుబల్లి మండలాలకు చెందిన 56మందికి రూ.5,606,496 విలువైన చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు తదితర సమస్యలపై చర్చించారు. అదేవిధంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన మైక్రో ఆర్టిస్ట్ గుమ్మడిదల గౌరీ శంకర్‌ను ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సన్మానించి అభినందించారు.

### ఇటుక బట్టి కార్మికులకు న్యాయచైతన్య సదస్సు

ఖమ్మం లీగల్, జూన్ 15: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రకాశ్ నగర్‌లోని ఇటుకబట్టీలో న్యాయచైతన్య సదస్సును నిర్వహించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎం. వలరాజు కార్మికులకు, యజమాన్యాలకు వివిద చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్మికులకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సేవాధికార సంస్థ ద్వారా లభ్యమవుతుందన్నారు. కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ సమన్వయకర్త కె. శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల హక్కులు, పరిరక్షణ తదితర అంశాలపై వివరించారు.

### కాల్వొడ్డు ఆంజనేయస్వామిదేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 15: కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవాల సహిత బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వీవీ నరసింహారావు, ఉపప్రధాన అర్చకులు ఎస్‌బి కృష్ణమాచార్యులు ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్ సర్వీస్‌లు పెంచాలి

వైరా, జూన్ 15: ప్రజల రవాణా అవసరాల సరిపడా ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను పెంచాలని కోరుతూ శనివారం వైరా ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్ టి.నాగేశ్వరరావుకు పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు ఓ వినతిపత్రం సమర్పించారు. మహాలక్ష్మీ పథకం వలన మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నందున బస్సుల్లో రద్దీ పెరిగిందని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రద్దీ వలన సౌకర్యంగా ఉండటం లేదని అందువలన బస్సు సర్వీస్‌లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీకే.రాకేష్, ఉపాధ్యక్షుడు మందా సురేష్, పీవోడబ్ల్యూ నాయకులు పరమేశ్వరి, మహాలక్ష్మీ, మాస్‌లైన్ పార్టీ నాయకులు సీవై.పుల్లయ్య, కె.అర్జున్‌రావు, యలదండి బాబు పాల్గొన్నారు.

### సప్తపది లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీదిరాల

పెనుబల్లి, జూన్ 15: సప్తపది లయన్స్‌క్లబ్ వీఎంబంజర్ 2024-25కు నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక సప్తపది గార్డెన్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా శ్రీదిరాల సుబ్బారావు, కార్యదర్శిగా మిట్టపల్లి శ్రీధర్, కోశాధికారిగా కారుమంచి ఆనంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ట్ ఛైర్మన్ మిట్టపల్లి జనార్ధన్, షేక్.అబ్దుల్ కలాం, సభ్యులు పాల్గొన్నారు.

### ఉద్యోగ, ఉపాధి కోసం యువత పోరాడాలి

వైరా, జూన్ 15: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత పోరాడాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జూటుతో ప్రేమ్‌సింగ్, ఎస్వీ.రాకేష్ పిలుపునిచ్చారు. శనివారం వైరాలో జరిగిన పీవైఎల్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శులు భరత్, గండికోట లక్ష్మణ్, మందా సురేష్ పాల్గొన్నారు.

### పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 15: పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లాలోని అన్ని ఉపాధ్యా సంఘాలు శనివారం డీఈవో సోమశేఖర శర్మను కలిసి వినతి పత్రం అందించారు. తొమ్మిదేళ్ల తర్వాతా పదోన్నతులు, ఆరేళ్ళ తర్వత బదిలీలు నిర్వహిస్తున్నందున ఎలాంటి అవకతవకలు లేకుండ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ నిబందనల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ పదోన్నతులు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, టీపీటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, విజయ్, రంజాన్, వీరబాబు, రాంబాబు పాల్గోన్నారు.

### కుర్నవల్లి సొసైటీ అభివృద్ధికి సహకరించాలి

తల్లాడ, జూన్ 15: టెస్కాబ్ తరపున కుర్నవల్లి సొసైటీకి సహకరించాలని టెస్కాబ్ చైర్మన్ ఎం.రవీంద్రరావును కుర్నవల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి కోరారు. నూతనంగా ఎన్నికైన టెస్కాబ్ చైర్మన్ రవీంద్రరాబును శనివారం ప్రదీప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రరావును పూలమాల, శాలువాతో సన్మానించారు.

### నేడు జక్కేపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

కూసుమంచి, జూన్ 15: మండలంలోని జక్కేపల్లి గ్రామంలో శ్రీసత్యసాయిరైతు సేవా నిలయంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు రైతు సేవా కోఆర్డినేటర్ కుదుముల వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆ కార్యక్రమంలో దేశవాళీ వరివిత్తనాల సేకరణకర్త విజయరామ్, సేవ్ ఆర్గనైజేషన్ డాక్టర్ కేవై రామచంద్రరావు, ఇంకా సొల్లేటి జైపాల్ రెడ్డి, సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు దమ్మాలపాటి సుధాకర్‌రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### రైతుల కోరిక మేరకే చెరువు లోతు

వేంసూరు, జూన్ 15: వేంసూరు పసుమర్తివారి కుంటలో రైతుల అభీష్టం మేరకే లోతు తీస్తారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కొంతమంది రైతులు, అధికారుల పనితీరుపై అవగాహన లేనివాళ్లే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం మర్లపాడు గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో పసుమర్తి వారి కుంట చెరువు కొంతమేర పోయిందని, దీని వల్ల ఆయకట్టు రైతులకు నీళ్ల సరిపోవని రైతుల కోరిక మేరకు మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. అనవసరంగా అధికారుల మీద ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, జగన్మోహన్‌రావు, ఫైజుద్దీన్ పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు


ఖమ్మంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న పువ్వాళ్ల, రాయల

ఖమ్మం సంక్షేమ విభాగం/ఎర్రుపాలెం, జూన్ 15: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతుల అంజనీ ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య, బొడ్డు బొందయ్య, దొబ్బల సౌజన్య, నాగ సీతారాములు, ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా భట్టి అభిమానులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆసుపత్రిలో ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో భట్టి జన్మదిన వేడుకలు నిర్వహించారు.


ఎర్రుపాలెంలో రక్తదానం చేసిన సాయికుమార్

ఎర్రుపాలెం: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలను శనివారం మండలంలోని జమలాపురంలోని బాలాజీభవన్‌లోగల వృద్ధాశ్రమంలో వీఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వీఎస్‌కే ఫౌండేషన్ చైర్మన్ వేజెండ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనుమోలు కృష్ణారావు, కంచర్ల వెంకటనరసయ్య, కర్నాటి శ్రీనివాసరెడ్డి, తల్లపురెడ్డి వెంకటరామిరెడ్డి దేవరకొండ రాజీవ్‌గాంధీ, గుడేటి బాబురావు, వీఎ స్యూత్,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమేశ్వరస్వామి దేవస్థానం షాపుల కౌలు వేలం 22న

నేలకొండపల్లి, జూన్ 15: నేలకొండపల్లిలోని శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన షాపుల అద్దెకు ఈనెల 22న దేవాదాయ శాఖాధికారులు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు దేవాలయం ఆవరణలో దేవాదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. పాల్గొనదలచిన వారు షాపునకు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

### ఉత్తరేశ్వరస్వామి భూముల కౌలు వేలం

నేలకొండపల్లిలోని శ్రీఉత్తరేశ్వరస్వామి వారి దేవస్థానానికి ఉన్న 3.29 ఎకరాలు భూమికి సంబంధించి సంవత్సర కాలానికి కౌలు వేలం ఈనెల 22న దేవాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల రైతులు డిపాజిట్‌గా రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

### ఆంజనేయస్వామి దేవాలయ భూముల కౌలు వేలం 21న

మండల పరిధిలోని బోదుబండలోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయానికి సంబంధించిన దాదాపు 19ఎకరాల భూమి కౌలు బహిరంగ వేలం ఈనెల 21న శుక్రవారం బోదులబండలోని దేవాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొను ఆసక్తి కల రైతులు రూ.10వేలు డిపాజిట్‌గా చెల్లించాలన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తులను నిరంతరం స్వీకరించాలి

● జడ్పీ సీఈవో వినోద్

బోనకల్, జూన్ 15: ప్రజా పాలన దరఖాస్తులను నిరంతరం స్వీకరించాలని జడ్పీ సీఈవో వినోద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజా సమస్యల పై వినతుల స్వీకరణ నిలిచి పోయిందన్నారు. ఇప్పటి నుంచి ప్రతిరోజు ప్రజల నుంచి వచ్చే సమస్యల దరఖాస్తులను తీసుకొని వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించారు. ఆర్థిక సంఘం ద్వార వచ్చిన నిధులతో చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో ఎల్. రాజు, ఈవోఆర్డీ శాస్త్రీ తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి తాగునీరు: ఎంపీడీవో

తిరుమలాయపాలెం, జూన్15: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీడీవో శేషాద్రి తెలిపారు. శనివారం మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెంలో మిషన్ భగీరథ సర్వే ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రత ఇంటికి భగీరథ ద్వారా తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమగ్రంగా సర్వే నిర్వహించి ప్రతి ఇంటికి తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి బాలాజీ, ఏపీవో నర్సింహారావు, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి సీపీఐ లోకి చేరికలు

ఖమ్మం రూరల్, జూన్ 15: ఖమ్మం రూరల్ మండలం, వరంగల్ క్రాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్‌కు చెందిన పలు కుటుంబాల వారు శనివారం సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ఆధ్వర్యంలో సీపీఐలో చేరారు. వారికి సీపీఐ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతు అధికారం ఉన్నా లేకపోయినా ఎర్రజెండా నీడలో ప్రజలపక్షాన అండగా నిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధి రాధాకృష్ణ, సీపీఐ జిల్లా నాయకులు చిన్న వెంకటరెడ్డి, దండి రంగారావు, శంకర్‌రెడ్డి, సురేందర్, వెంకన్న, రమేష్, వీరన్న, రవి, నాగేశ్వరరావు, చక్రవర్తి తదితరులు పాల్గోన్నారు.

### ప్రతిభ చాటిన ప్రియదర్శిని విద్యార్థిని

ఖమ్మం రూరల్, జూన్ 15: మండల పరిదిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆసిఫా సాఫ్టైర్ ఇంజనీర్‌విభాగంలో పాకేజ్ ఆఫ్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌గా రూ.11 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బి.గోపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు ఆసిఫాను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### 24న మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలు

కల్లూరు, జూన్ 15: కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలు జరగనున్నాయని మండల క్రీడా విభాగం నోడల్ అధికారి పి నివేదిత, వ్యాయామ ఉపాధ్యాయుడు పి వీరరాఘవయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మినీస్టేడియం క్రీడా ప్రాంగణం నందు బ్యాటరీ టెస్ట్ 9 రకాల క్రీడా అంశములలో పోటీలు నిర్వహించి (క్రీడాకారులను) పాఠశాలలను ఎంపిక చేస్తారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నాలుగవ తరగతి చదువుతున్న వారికి విద్యార్థులకు మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన వారికి తదుపరి ఈ నెల 27 న సర్దార్ పటేల్ స్టేడియం ఖమ్మం నుండు జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట పాఠశాలల్లో చదువుతున్న ధృవ ప్రతాలు, ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకోని రావాలని వారు కోరారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కల్లూరు, జూన్ 15: కల్లూరులోని ఎన్నెస్పీలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం 'తోపుడుబండి' ఫౌండేషన్ తరుపున విద్యార్థులకు సంస్థ అధినేత ఎండి సాదిక్‌అలీ, ఎంఈవో దామోదరప్రసాద్ నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నివేదిత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కే పుష్పావతి, వ్యాయామ ఉపాధ్యాయుడు పి వీరరామవయ్య, ప్రముఖులు సుభానీ, మల్లయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారి సర్వే పూర్తి


సర్వే చేస్తున్న అధికారులు

చింతకాని, జూన్ 15: మండల పరిధిలోని వందనం గ్రామ రెవెన్యూ పరిధిలో పెండింగ్‌లో నాగపూర్-అమరావతి జాతీయ రహదారి సర్వే ప్రక్రియను అధికారులు శనివారం పూర్తి చేశారు. గతంలో సర్వేకు కొందరు రైతులు అభ్యంతరం తెలుపగా రైతులకు నచ్చజెప్పిన అధికారులు పోలీస్ పహారాలో శనివారం సర్వే నిర్వహించి 15 ఎకరాలు సేకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మధుసూధన్‌నాయక్, వైరా ఏసీపీ రెహమాన్, కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్, ల్యాండ్ సర్వే డిప్యూటి ఇన్‌స్పెక్టర్ లూర్దు, తహసీల్దార్ రమేష్, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సత్తుపల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్, జూన్ 15: సత్తుపల్లి పట్టణంలోని కాకర్లపల్లి రోడ్ ఫీడర్ ట్రీ కటింగ్, నిర్వహణ నిమిత్తం ఆదివారం ఐపీడీఎస్ 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శనివారం ట్రాన్స్‌కో ఏఈ శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30నుంచి 11.30వరకు మసీద్ రోడ్, సురేష్ సైకిల్‌షాప్ రోడ్, కాకర్లపల్లి రోడ్, శివసాయి నగర్, వాయిపుత్ర నగర్, హనుమాన్ నగర్ పరిధిలోని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### కల్లూరులో..

కల్లూరు: కల్లూరు పట్టణంలో ఆదివారం 33 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతారాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ గణేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్లూరు టౌన్ 1 పరిధిలో సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్లే కుడి చేతి వైపు ప్రాంతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

ఖమ్మం రూరల్, జూన్ 15: మండల పరిదిలోని కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన ప్రజాపంథా జిల్లా నాయకుడు మలీదు నాగేశ్వరరావు సతీమణి పద్మ ఇటీవల మృతి చెందినది. విషయం తెలుసుకున్న యాదవసంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకట నరసయ్యలు శనివారం ఆమె చిత్రపటంవద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మారుతి ఎట్టయ్య, సతీష్, అప్పారావు, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.



# గ్రామదీపికలపై చర్యలు తీసుకోవాలి

### సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


గ్రామదీపికపై ఫిర్యాదు చేస్తున్న ప్రజాప్రతినిధులు

ముదిగొండ, జూన్ 15: వసూళ్లకు పాల్పడుతున్న గ్రామ దీపికలపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ డ్వాక్రా మహిళల వద్ద గ్రామదీపికలు డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీఎం కల్పన దృష్టికి తీసుకువచ్చారు. తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని కల్పన తెలిపారు. సాగర్ నీరు వచ్చేనాటి కల్లా కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం, చెట్లను తొలగించి చివరి భూములకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే వారిని తక్కువ విద్యార్థులున్న పాఠశాలలకు పంపించాలని పలువురు ఎంఈవో రామాచారి దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏవో రాధకు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మంకెన దామోదర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ రిటైల్ ఎక్స్‌పో మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

ఖమ్మంవ్యవసాయం, జూన్ 15: యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని దోరేపల్లి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక రిటైల్ ఎక్స్‌పో మేళాకు విశేష స్పందన లభించింది.. బిల్డర్లు, ఎడ్యుకేషన్ ఇన్సిటిట్యూట్లు, సోలార్ డీలర్లు, పాల్గొన్నారు. అర్హులైన వారికి గృహ, వాహన, విద్యా, తదితర రుణాలకు సంబంధించిన శాంక్షన్ లెటర్లను అందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ డిప్యూటీ మేనేజర్ హన్మంతరెడ్డి, క్రెడాయ్ ప్రెసిడెంట్ బండి జయకిషోర్, బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, ప్రియదర్శిని కళాశాల డైరెక్టర్ కె. నవీన్‌బాబు డిప్యూటీ రీజనల్ హెడ్స్ సర్వేష్, సుధాకర్ రిటైల్ లోన్ చీప్ మేనేజర్ మారుతి తదితర మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.